క్లుప్తంగా

విద్యార్థులు దేశభక్తి చాటాలి



పెనమలూరు: విద్యార్థులు దేశభక్తిని చాటాలని కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్ బాబు తెలిపారు. కాలేజీలో శనివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నాదేశం-నాభూమి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృదేశం కోసం అమరులైన వీరులకు ఘన నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి గీతాలు ఆలపించారు. కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి దేశ ప్రగతికి తమ వంతు కృషి చేయాలన్నారు. స్వాతంత్య్ర సమర యోధులు త్యాగాలు వృథా పోనీయరాదని పిలుపు నిచ్చారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు షేక్.చాన్‌బాషా, బి.వెంకట్, బాలే అరుణాదేవి, మహేష్‌నాయర్, ఎస్.శ్రీనివాస్. పి.రాము, పి.శారద, లైబ్రేరియన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నున్నలో ఉచిత వైద్య శిబిరం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి దేవస్థానం చినకంచిలో ఆదివారం ఎంజె నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య సేవా శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్టీ మొక్కపాటి శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బీపీ, షుగర్, ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. నున్న, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

ఉయ్యూరు: మండలంలోని కలవపాములలో గల వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేశారు. పౌష్టికాహార పంపిణీ, ఐరన్, కాల్షియం మాత్రలు అందించారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్‌బాబు పరిశీలించి మిషన్ ఇంద్రధనస్సుపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దీప, ఆరోగ్య విస్తరణాధికారి నాగార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

110 మంది కంటి వైద్య పరీక్షలు



కంకిపాడు: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి కోరారు. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ శివనాగిరెడ్డి ప్రారంభించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ 110 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. శుక్లాలు ముదిరిన పలువురిని ఆసుపత్రికి శస్త్రచికిత్స నిమిత్తం రిఫర్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్యోతిర్మయి, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు విజయలక్ష్మి, శారద పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మూర్తి హఠాన్మరణం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి (52) శనివారం రాత్రి హఠాన్మరణం చెందారు. ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయిన మూర్తిని కుటుంబ సభ్యులు హుటాహుటిన హనుమాన్‌జంక్షన్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెరికీడులోని శివాలయం పాలక మండలి సభ్యుడిగా దేవస్థానం అభివృద్ధిలో మూర్తి ముఖ్య పాత్ర వహించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వీరాభిమానిగా ఈ ప్రాంతవాసులకు ఆయన సుపరిచితుడు. ఈ నెల 18వ తేదీన ఆయన పెద్ద కుమారుడు ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లనుండటంతో ఇంటిల్లిపాదీ ఆ సంతోషంలో ఉండగా, ఆయన ఆయన ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. మూర్తి మృతితో గ్రామంలో సైతం విషాదఛాయలు అలముకున్నాయి.

వేలేరులో అభివృద్ధి పరుగు

- రూ.29.80 కోట్లతో వేలేరు - బొమ్ములూరు రహదారి
- రూ.7.5 కోట్ల వ్యయంతో వేలేరు - మీర్జాపురం రహదారి



నాబార్డు నిధులతో నిర్మించిన వీరవల్లి-మీర్జాపురం రహదారి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులో అభివృద్ధి పరుగులు పెడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుమారు రూ.38.90 కోట్ల వ్యయంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. రెండు జాతీయ రహదారులను వేలేరుకు అనుసంధానం చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మిస్తున్న రోడ్లు ప్రగతికి బాటలుగా మారుతున్నాయి. మారుమూల గ్రామాలను జాతీయ హైవేలకు నేరుగా కలుపుతూ నిర్మిస్తున్న ఈ రోడ్లతో రవాణా సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. వేలేరులో రూ.1.60 కోట్ల వ్యయంతో పలు ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

ఆరు గ్రామాలను కలుపుతూ...

బాపులపాడు, నూజివీడు మండలాల్లోని ఆరు గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న రోడ్డును విస్తరించటంతో పాటుగా అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.29.80 కోట్ల నిధులను మంజూరు చేసింది. బాపులపాడు మండలంలోని కోమటిగుంట నుంచి మొదలయ్యే ఈ రోడ్డు వేలేరు మీదగా మర్రిబంధం సెంటర్‌కు చేరుకుని, అక్కడి నుంచి నూజివీడు మండలంలోని సీతారామపురం, పల్లెర్లమూడి గ్రామాలను కలుపుకొంటూ, ఆ తర్వాత కొయ్యూరు మీదగా బొమ్ములూరు వద్ద మళ్లీ 16వ నంబర్ జాతీయ రహదారిని కలుస్తుంది. దాదాపు 18 కిలోమీటర్ల మేర ఆరు గ్రామాల గుండా నిర్మిస్తున్న ఈ రోడ్డుకు ఆయా గ్రామాల పరిధిలో సీసీ రోడ్డు కూడా నిర్మించనున్నారు. ప్రస్తుతం నాలుగు మీటర్లు వెడల్పు కలిగిన ఈ రోడ్డును 23 అడుగులకు విస్తరించనున్నారు. ఇప్పటికే ఈ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. అవసరమైన చోట్ల కల్వర్టులు, చెరువుల వద్ద రిటైనింగ్ వాల్స్‌ను నిర్మిస్తున్నారు.



వేలేరులో నిర్మాణం పూర్తయిన రైతు భరోసా కేంద్రం

రెండు జాతీయ రహదారులను కలుపుతూ...

వేలేరు శివారులోని కోమటిగుంట చెరువు రోడ్డు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి రేమల్లే, కొత్త మల్లవల్లి గ్రామాల మీదగా ఏలూరు జిల్లా మీర్జాపురం వద్ద జాతీయ రహదారి 216హెచ్‌ను కలుపుతూ కొత్త రహదారి నిర్మాణం చేపట్టారు. నాబార్డు రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మంజూరైన రూ.7.5 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించారు. దీంతో వేలేరు, రేమల్లే, కొత్తమల్లవల్లి గ్రామాలకు నేరుగా కోమటిగుంట వద్ద చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపైకి వచ్చేందుకు అవకాశం ఏర్పడింది. ఆయా గ్రామాల రైతులకు వ్యవసాయ ఉత్పత్తులైన వరి, చెరకు, పామాయిల్ రవాణా చేసుకునేందుకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది.

రూ.1.60 కోట్ల వ్యయంతో పలు ప్రభుత్వ భవనాలు

వేలేరులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాలను వేలేరు-సీతారామపురం ప్రధాన రహదారి వెంట రూ.87.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూడు భవనాల నిర్మాణాలు దాదాపుగా పూర్తికావచ్చాయి. ఎస్టీ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తాజాగా నిధులు మంజూరయ్యాయి. రైతు భరోసా కేంద్రానికి అనుసంధానంగా రూ.35 లక్షల వ్యయంతో గోడౌన్, రూ.23 లక్షల వ్యయంతో డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రూ.1.5 లక్షల విలువ చేసే బంగారు గొలుసు పోగొట్టుకున్న వ్యక్తికి ఆరు రోజుల వ్యవధిలోనే హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఆ గొలుసు ఆచూకీ కనిపెట్టి అందించారు. వివరాల్లోకి వెళ్లితే.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన జాగర్లమూడి వెంకటేశ్వర్లు తన కుటుంబంతో కలిసి ఈ నెల 6న గుంటూరు వచ్చి తిరిగి వెళుతూ మార్గమధ్యలో 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద ఉన్న ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసేందుకు ఆగారు. ఆ తరుణంలో వెంకటేశ్వర్లు కుమారుడి మెడలోని మూడు కాసుల బంగారు గొలుసు పోగొట్టుకున్నారు. హోటల్ ప్రాంగణంలో ఎంత వెదికినా దొరక్కపోవటంతో హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆదేశాలతో పోలీస్ సిబ్బంది రెస్టారెంట్ ప్రాంగణంలోని సీసీ కెమెరాల పుటేజీను క్షుణ్ణంగా పరిశీలించారు. హోటల్ వద్ద గొలుసు జారిపడిన కొద్దిసేపటి తర్వాత ఓ వ్యక్తి దాన్ని తీసుకోవటం పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ తెలుసుకుని, విషయం ఆరా తీయగా ఆ వ్యక్తి బంగారు గొలుసును పోలీసులకు అప్పగించాడు. హనుమాన్‌జంక్షన్ సీఐ కార్యాలయంలో శనివారం వెంకటేశ్వర్లుకు బంగారు గొలుసును సీఐ అందించారు. ఈ కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించిన కానిస్టేబుల్ షేక్ నబీని సీఐ నవీన్ నరసింహామూర్తి అభినందించారు.



వెంకటేశ్వర్లుకు బంగారు గొలుసు అందిస్తున్న సీఐ నవీన్ నరసింహమూర్తి

పిల్లల్ని కొట్టిన మహిళపై కేసు నమోదు

పెనమలూరు: ఇద్దరు చిన్నారులను కొట్టిన మహిళ పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. తాడిగడప కార్మికనగర్‌లో పిట్టు సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె మనవళ్లు శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో రాయి ఎదురు ఉంటున్న సీత ఇంటి వద్ద పడింది. దీంతో సీత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిల్లలపై దాడి చేసి గాయపరచింది. ఈ ఘటనపై సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వర్షంతో రహదారులు జలమయం



గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. తెంపల్లిలో వర్షం నీటితో రహదారులు చెరువులుగా మారాయి. తెంపల్లి నుంచి బల్లిపర్రు వెళ్లే రోడ్డులో మూడు అడుగుల మేర నీరు నిలవటంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ కొలుసు శిరీష వర్షం నీటిని తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

నేడు సెమినార్

కంకిపాడు: పట్టణంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో ఈ నెల 13న లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో జాబ్ ఓరియెంటెడ్ సెమినార్ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కె.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన వివరాలు తెలుపుతూ ఆదివారం ఉదయం 9 గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందన్నారు. కళాశాల విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాల కోసం సెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మ విశ్వాసంతో లక్ష్యాలు చేరువ

ప్రపంచ బ్యాంక్‌లో ఉద్యోగం సాధించిన ఇందు



పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇందుని అభినందిస్తున్న దృశ్యం

పెనమలూరు: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో లక్ష్యం చేరుకోవాలని ప్రపంచ బ్యాంకులో ఉద్యోగం సాధించిన పెనమలూరు గ్రామానికి చెందిన కిలారు ఇందు అన్నారు. ప్రపంచ బ్యాంకులో ఉద్యోగం పొందిన ఇందుతో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాజమాన్యం శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందు మాట్లాడుతూ లక్ష్యం పై ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తాను లక్ష్యం చేరుకోవటానికి ప్రతి రోజూ 15 నుంచి 18 గంటలు చదువుకునేదానినన్నారు. విద్యార్థులకు మంచి స్నేహితులు ఉండాలని, గమ్యం చేరుకునే వరకు నిరుత్సాహ పడరాదన్నారు. మనం చదివే చదువు సమాజానికి మేలు చేసే విధంగా ఉండాలని కోరారు. తాను ప్రపంచ బ్యాంకులో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో అహర్నిశలు శ్రమించి ఫలితం సాధించానని వివరించారు. నేడు ప్రభుత్వ పాఠశాలలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను విద్యార్థులు మార్గ దర్శకులుగా ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు, ఇందు తండ్రి కిలారు సత్యనారాయణ, విద్యా దాత కిలారు శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం కాల్వనీరు వరి పొలాలకు వరం



నున్న పోలవరం కాల్వ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు

నున్న(విజయవాడరూరల్): పోలవరం కాల్వనీరు గ్రామాల్లో వరి పొలాలకు వరంలా ఉపయోగపడుతున్నాయి. పోలవరం కాల్వ నీటిని చెరువులకు నింపుకొని అక్కడ నుంచి వరిపంట పొలాలకు రైతులు సాగునీరుగా ఉపయోగించుకుంటున్నారు. నున్న గ్రామ రైతుల విజ్ఞప్తి మేరకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఐదేళ్ల క్రితం నున్న గ్రామంలో పోలవరం కాల్వ నుంచి నీటిని తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది నీరు లేక పొలాలు బెట్టకొచ్చినప్పుడు మోటార్ల ద్వారా నీటిని తోడుకొని ఎర్రచెరువు, పుల్లయ్య చెరువు, జంగమవాని చెరువులను నింపుకొని, అనంతరం చెరువుల నుంచి పొలాలకు పోలవరం కాల్వ నీటిని ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం కూడా పొలాలు బెట్టకు రావడంతో రైతులు కమిటీగా ఏర్పడి మోటార్ల ద్వారా నీటిన చెరువులకు పంపుతున్నారు. ఆ మూడు చెరువుల ఆయకట్టు పరిధిలో 500 ఎకరాల వరి సాగు జరుగుతుందని రైతు కమిటీ ప్రతినిధులు రమేష్‌రెడ్డి, శివశేషిరెడ్డి, హనుమాన్ రెడ్డి తెలియజేశారు. పోలవరం కాల్వలో నీరు రావడం వలన నున్న, పాతపాడు, నైనవరం, కొత్తూరు తాడేపల్లి గ్రామాల రైతులు వరిపంట సాగుచేసుకొంటున్నారు. పాతపాడు గ్రామంలో పోలవరం కాల్వ నుంచి ఎర్ర చెరువు ఆయకట్టు భూములకు సాగునీరు అందజేస్తామని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి తెలియజేశారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో కూడా పోలవరం నీటిని రైతులు చెరువుకు పెట్టుకొని వరి పొలాలకు ఉపయోగించుకుంటున్నారు. వర్షాలు లేని ప్రస్తుత పరిస్థితుల్లో పోలవరం కాల్వ నీరు రైతులకు ఒక వరంలా ఆదుకుంటోంది.

క్షేత్రస్థాయిలో ఈ క్రాప్ నమోదు చేయాలి



వీపీఏలతో సమీక్షిస్తున్న ఏవో హరీష్‌కుమార్

ఉంగుటూరు: క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలతో ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాయలంలో ఈ క్రాప్ బుకింగ్‌పై గ్రామ వ్యవసాయ సహాయకులతో శనివారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేయడం వలన రైతులకు కలిగే లాభాలను వివరించాలని సూచించారు. వీపీఏలు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి పంటను ఎప్పుడు వేశారు, ఎంత విస్తీర్ణంలో వేశారు, రైతుల ఆధార్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ పంట నమోదు ప్రతి సంవత్సరం ప్రతి పంటకు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దుర్గానాగేశ్వరరావు, వీపీఏలు పాల్గొన్నారు.

21 నుంచి టైలరింగ్ శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21వ తేదీ నుంచి టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి టైలరింగ్‌లో 8 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19వ తేదీ లోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 0866 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు

గద్దర్ మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటు

సంస్మరణ సభలో వక్తలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా యుద్ధనౌకగా పేరొందిన గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యాన రచయిత, కళాకారుడు, వాగ్గేయకారుడు గుమ్మడి విఠల్ రావు(గద్దర్)సంస్మరణ సభ జరిగింది. తొలుత గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు గద్దర్ పాటలు పాడి నివాళులర్పించారు. ఏఎస్‌యూ ఆచార్యులు చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ గద్దర్ జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. సంస్మరణ సభలో తంగిరాల సోనీ (బహుజన రచయితల వేదిక), మోతుకూరి అరుణ్‌కుమార్ (అరసం) శిఖా పేరురి మురళి కుమార్, ఎస్.ఎస్.సి బోస్ (పౌర హక్కుల సంఘం), శిఖా ఆకాష్, మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్ (ఏ బి ఎస్ పార్టీ), కృష్ణ (దళిత మహాసభ) కొరబండి బాబురావు, ఆర్ .పిచ్చయ్య, ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

కంకిపాడు: కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ కోరారు. మండలంలోని ఈడుపుగల్లు ఎస్‌జీఎస్ కల్యాణ మండపంలో కృష్ణా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం 23వ మహాసభలు శనివారం నిర్వహించారు. బీకేఎంయు పతాకాన్ని సంఘం సీనియర్ నాయకులు మర్రి ముత్యాలు ఆవిష్కరించారు. అనంతరం మేరుగు విజయ్‌కుమార్, కంచర్ల ప్రభుకుమారి, నాగేశ్వరరావు అధ్యక్ష వర్గంలో జరిగిన సభలో శేఖర్ మాట్లాడారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు భూమి లేని వ్యవసాయ కార్మికుడు కుటుంబానికి ఒక హెక్టారు భూమి ఇవ్వాలన్నారు. జగనన్న లే అవుట్‌లలో మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. సంక్షేమ పథకాలతో పాటుగా అభివృద్ధి పైనా దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జల్లి విల్సన్ మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల అమలు కార్మిక సంఘ పోరాటాల ఫలితమేనన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డా ప్రసాద్, నాయకులు సురేంద్ర, బెనర్జీ, మల్లు పెద్దు రత్నకుమారి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జయహో జగజ్జనని



దుర్గగుడిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): జయహో జగజ్జనని అంటూ భక్తజనం కనకదుర్గమ్మను కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించారు. రెండో శనివారం, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరిగింది. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టగా, రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇన్‌చార్జ్ ఈవో కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్జిత సేవల్లో ఉభయదాతలు

అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మరో వైపున ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ. 300,రూ. 500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ నేపథ్యంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరల కౌంటర్‌ను చైర్మన్ కర్నాటి రాంబాబు తనిఖీ చేశారు. భక్తులు ఇచ్చిన ప్రతి చీరకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

‘ఏనుగుల కోడు’ గోడు తీరింది



పూడిక తీయక ముందు ఏనుగుల కోడు డ్రెయిన్



పూడిత తీత పనులు జరిగిన తరువాత ఇలా..

- పంట పొలాలకు తప్పిన ముంపు ముప్పు
- సంతోషం వ్యక్తంచేస్తున్న రైతులు

పెనమలూరు: రైతులకు సమస్యగా ఉన్న ఏనుగుల కోడు గోడు ఎట్టకేలకు తీరింది. ఏనుగుల కోడు డ్రెయిన్‌లో పూడికతీత పనులు పూర్తి చేయటంతో పంట పొలాలకు ముంపు ముప్పు తప్పింది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలోని తాడిగడపలో ప్రారంభమయ్యే ఏనుగుల కోడు డ్రెయిన్ పెదపులిపాక, పెనమలూరు, చోడవరం, వణుకూరు, మద్దూరు, రొయ్యూరు మీదుగా వల్లూరుపాలెం వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంత పంట పొలాల నుంచి వృథా నీరు, అధిక వర్షాలు కురిసినప్పుడు వర్షపునీరు దిగువకు ప్రవహించేందుకు ఏనుగుల కోడే ఆధారం. పంట పొలాలు ముంపుకు గురి కాకుండా ఈ డ్రెయిన్ రైతులకు ఎంతగానో మేలుచేస్తోంది. అయితే పూడిక తీత పనులు జరగక, అనేక ప్రాంతాల్లో డ్రెయిన్ ఆక్రమణలకు గురికావటం రైతులకు శాపంగా మారింది. గుర్రపు డెక్కతో పాటు ఇతర పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగటంతో డ్రెయిన్‌లో నీటి పారుదల నిలిచిపోయింది. ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వందల ఎకరాలు ముంపుబారిన పడ్డాయి.

స్పందించిన ఎమ్మెల్యే కేపీ సారథి

వర్షాలతో వందల ఎకరాలు ముంపు బారిన పడటంతో మండల రైతులు తీవ్ర ఆందోళన చెందారు. రైతుల కష్టాలు తెలుసుకున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వెంటనే స్పందించారు. ఏనుగుల కోడులో పూడిక తీత పనులు ఎందుకు చేయలేదని డ్రెయినేజీ శాఖ అధికారులను నిలదీశారు. ఉన్నతాధికారులతో చర్చించి డ్రెయిన్‌లో పూడిక తీత పనులు వేగంగా చేయించారు. గుర్రపు డెక్కతో పాటు పిచ్చి మొక్కలు, ఆక్రణలను తొలగించారు. దీంతో ఏనుగుల కోడులో నీరు సజావుగా ప్రవహిస్తోంది. దీంతో వందల ఎకరాల పంట పొలాలు ముంపు బారి నుంచి బయటపడ్డాయి. సకాలంలో ఎమ్మెల్యే పార్థసారథి స్పందించటం పై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సహకారంతోనే...

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తీసుకున్న చొరవతో ఏనుగుల కోడు సమస్య పరిష్కారమైంది. ఏనుగుల కోడు డ్రెయిన్‌పై వందల ఎకరాలు ఆధారపడి ఉన్నందున ఏటా అధికారులు పూడిక తీత పనులు చేయించాలి. పంట పొలాలు ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– గంటూరు శ్రీనివాస చౌదరి, సర్పంచ్, పెదపులిపాక